సాక్షి
శ్రీకాకుళం
మంగళవారం । 8 । ఏప్రిల్ । 2025



ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి..

గ్రీవెన్స్‌కు వినతులు వెల్లువెత్తాయి. ప్రజలు, నాయకులు సమస్యలు ఏకరువు పెట్టారు.

- 8లో



వంశధారలో పడి జాలరి..

వంశధారలో పడి ఓ జాలరి మృతి చెందారు. మడపాం వద్ద ఘటన జరిగింది.

- 8లో

డిగ్రీ నాలుగో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయం పరిధిలోని డిగ్రీ నాలుగో సెమిస్టర్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. 53 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఐదు గంటల మధ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. తొమ్మిది వేల మంది వరకు పరీక్షలు రాస్తున్నారు.

న్యూస్‌రీల్

'ఆధార్ సేవలు వినియోగించుకోండి'

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆధార్ సేవలు ప్రజలకు సులభంగా అందించేందుకు ప్రభుత్వం ప్రణాళిక అమలు చేస్తోందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని 732 గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రతి ఐదు సచివాలయాలకు ఒక ఆధార్ సెంటర్ ఏర్పాటు చేశామని, ఇప్పటివరకు 146 ఆధార్ కిట్లు అందుబాటులోకి తీసుకువచ్చామని వివరించారు. ఇంకా 37 కేంద్రాలు ఈ నెలాఖరుకు అందుబాటులోకి రానున్నాయని, ఆధార్‌కు సంబంధించిన కొత్త కార్డు నమోదు, డాక్యుమెంట్ అప్‌డేట్, 5 నుంచి ఏడేళ్లు, 15 నుంచి 17 సంవత్సరాల వయసుగలవారి మాండేటరీ బయోమెట్రిక్ అప్‌డేట్, మొబైల్ నెంబర్ అనుసంధానం వంటి సేవలు ఈ ఆధార్ కేంద్రాల్లో లభ్యమవుతున్నాయని కలెక్టర్ వెల్లడించారు. ప్రజల సౌకర్యార్థం ప్రతి నెలలో 8 రోజుల పాటు గ్రామ వార్డు సచివాలయ శాఖ ఆధ్వర్యంలో క్యాంప్ మోడ్‌లో ఆధార్ సేవలు అందిస్తున్నారని వివరించారు. ముఖ్యంగా ఆరేళ్ల లోపు పిల్లలు తమ జనన తేదీ వివరాలతో సమీప ఆధార్ కేంద్రాన్ని సంప్రదించి ఆధార్ నమోదు చేయించుకోవాలని సూచించారు.

ఐటీడీఏ ఏర్పాటు చేయాలని ధర్నా



ఐటీడీఏ ఏర్పాటుకు గిరిజనులు ధర్నా

మందస: జిల్లాలో ఐటీడీఏ లేక గిరిజన ప్రజల సమస్యలు పరిష్కారం కావడం లేదని ఆదివాసీ సంఘ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో ఐటీడీఏ ఏర్పాటు చేయాలని కోరుతూ మందసలో సోమవారం ధర్నా నిర్వహించారు. గిరిజనుల హక్కులు రక్షించాలని, అటవీ భూముల ఆక్రమణలు ఆపాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సవర గురునాథ్, జిల్లా కమిటీ సభ్యుడు సవర ఫాల్గుణరావు డిమాండ్ చేశారు. గిరిజన గ్రామాలను షెడ్యూలు జాబితాల్లో చేర్చాలని, 50 శాతానికి పైగా గిరిజనులు ఉన్న పంచాయతీలను విడదీసి గిరిజన పంచాయతీలుగా ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం వినతి పత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ రామకృష్ణకు అందజేశారు. కార్యక్రమానికి రైతుల సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి గణపతి సంఘీభావం తెలిపారు.

తాగి వాహనం నడిపితే లైసెన్స్ రద్దు : ఎస్పీ



శ్రీకాకుళం క్రైమ్ : మద్యం సేవించి వాహనాలు నడిపితే సంబంధిత వాహనదారుల లైసెన్సులను రద్దు చేస్తామని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి హెచ్చరించారు. ఇప్పటికే 70 మందివి లైసెన్సులు రద్దు చేశామని, మరో 60 మంది లైసెన్సుల రద్దునకు జిల్లా రవాణా కమిషనర్‌కు ప్రతిపాదనలు పంపించామన్నారు. శ్రీకాకుళంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో భాగంగా ద్విచక్రవాహనదారులు, ఆటోలు పార్కింగ్‌కు కేటాయించిన ప్రదేశాల్లో వాహనాలు పార్కింగ్ చేయాలన్నారు. ఆర్టీసీ కాంప్లెక్సు, రైతు బజారు, ఏడురోడ్ల కూడలి వద్ద ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా ఆటోలు అధిక సంఖ్యలో రహదారి మార్గంలో నిలిపితే త్రోయింగ్ వాహనంలో స్టేషన్‌కు తరలిస్తామన్నారు. మైనర్లు డ్రైవింగ్ చేస్తే బాధ్యులుగా వారి తల్లిదండ్రులు లేదా సంబంధిత వాహన యజమానులపై కేసులు నమోదు చేస్తామని, త్రిబుల్ డ్రైవింగ్ చేస్తే జరిమానాలతో పాటు కేసులుంటాయని, సిగ్నల్స్ జంపింగ్ చేయొద్దని, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు కడతామని హెచ్చరించారు.



ఏమి సేతువు..?

శ్రీకాకుళం నగరం శివారులోని ఖాజీపేట పరిధిలో ఇరిగేషన్ కాలువపై నిర్మించిన వంతెన ఇది. కాలువ అవతల వేసిన లేఅవుట్‌కు రహదారి లేకపోవడంతో ఇరిగేషన్ కాలువపై నిర్మించిన వంతెనను రహదారిగా చేసుకున్నారు.

- ఇరిగేషన్ కాలువలపై అడ్డగోలు వంతెనలు
- జిల్లా కేంద్రం చుట్టూ అక్రమ నిర్మాణాలే
- లేఅవుట్ల రహదారుల కోసం ఇరిగేషన్ కాలువలపై వంతెనలు
- ఖాజీపేట పరిధిలో ఎక్కువ నిర్మాణాలు



ఖాజీపేట పరిధిలో ఇరిగేషన్ కాలువపై నిర్మించిన వంతెన అవతల ఉన్న లేఅవుట్ ప్లాట్లు ఇవి. వంతెనను రహదారిగా చూపించి విక్రయాలు జరిపారు. వంతెన లేకపోయి ఉంటే అది వ్యవసాయ భూమిగా తప్ప వ్యవసాయేతర అవసరాలకు ఉపయోగపడదు.

అరసవల్లి దేవస్థానానికి కూత వేటు దూరంలో ఉన్న వాడాడ పంచాయతీ పరిధిలో గల ఇరిగేషన్ కాలువపై నిర్మించిన వంతెన ఇది. అనుమతి లేకుండా నిర్మించారు. అవతల భూముల్లో లేఅవుట్ వేసేందుకు, దానికి రహదారి కోసం నిర్మించిన వంతెన ఇది.



వాడాడ వంతెనకు కలుపుకుని కొత్తగా నిర్మించిన రోడ్డు ఇది. ఇది కూడా అక్రమంగానే వేశారు. అరసవల్లి దేవస్థానం భూములను ఆక్రమించి రోడ్డు వేసేశారు. విలువైన భూమిని అవతల ఉన్న తమ లేఔట్ కోసం రోడ్డుగా మార్చేశారు.



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :

జిల్లా కేంద్రం, శివారు ప్రాంతాల్లో ఉన్న ఇరిగేషన్ కాలువలపై అనేక చోట్ల లే అవుట్ల కోసం అడ్డగోలుగా వంతెనలు నిర్మించారు. కొందరు అనుమతి లేకుండా వేసుకోగా, మరికొందరు అనుమతులు ఉన్నాయని చెప్పుకుని ఇరిగేషన్ కాలువలపై వంతెనలు నిర్మించారు. ఈ క్రమంలో ఇరిగేషన్ భూములు, దేవాదాయ శాఖ భూములు ఆక్రమణకు గురవుతున్నాయి. వ్యవసాయ భూముల్లో వేసే లేఅవుట్లకు రహదారి సౌకర్యం లేకపోవడంతో ఆ భూములకు విలువ లేకుండా పోతోంది. ప్లాట్లుగా వేసినప్పటికీ కొనుగోళ్లు జరగడం లేదు. దారి లేని ప్లాట్లతో ఇబ్బంది అని కొనుగోలు దారులు ఆసక్తి చూపడం లేదు. దీంతో ఇరిగేషన్ కాలువలనే రహదారిగా ఎంచుకుంటున్నారు. అడ్డంగా వంతెనలు నిర్మించి, వాటిని లేఅవుట్ దారిగా చూపించుకుని స్థలాలు అమ్ము కుంటున్నారు. శ్రీకాకుళం నగరం శివారు నలుమూలలా ఈ రకమైన వంతెనలు రాత్రికి రాత్రి నిర్మిత మవుతున్నాయి. పనిలో పనిగా అక్కడున్న ఇరిగేషన్ స్థలాలు, దేవదాయ శాఖ స్థలాలు కూడా ఆక్రమణకు గురవుతున్నాయి. కొన్ని చోట్ల వాటిపైనే లేఅవుట్ రహదారులు వేస్తున్నారు.

అంతా 'ఆయన' డైరెక్షన్‌లోనే..

నగర శివారులో ఎక్కువగా ఖాజీపేట రెవెన్యూ పరిధిలో అక్రమంగా వంతెనల నిర్మాణాలు జరిగాయి. అక్కడో అధికార పార్టీ నాయకుడి కనుసన్నల్లోనే ఈ నిర్మాణాలు జరుగుతున్నాయి. ఆయనకు ముడుపులిస్తే అక్రమ కట్టడాలకు గ్రీన్ సిగ్నల్ ఇస్తారు. తనకు తెలియకుండా, ముడుపులు ఇవ్వకుండా నిర్మాణాలు చేస్తే వాటిని కూల్చి వేయిస్తారు. ఆ తర్వాత దారికి వచ్చాక మళ్లీ వంతెనలు నిర్మించుకోవడానికి అనుమతిస్తారు. అక్కడంతా ఆయన డైరెక్షన్‌లోనే జరుగుతోంది. మొత్తానికి నగర శివారులో నిర్మిస్తున్న అక్రమ వంతెనలతో కోట్ల రూపాయలు ఆర్జిస్తున్నారు. లేఅవుట్లకు లేని రహదారి కోసం ఇరిగేషన్ కాలువలపై నిర్మించిన వంతెనలతోనే కొనుగోలు దారుల్ని మాయ చేస్తున్నారు.

ఆదిత్యపురిలో పెళ్లి సందడి



సుగంధ ద్రవ్యమర్ధన జరుగుతున్న దృశ్యం

అరసవల్లి: సూర్యనారాయణ స్వామి వార్షిక కల్యాణ మహోత్సవానికి ఆదిత్యపురి సిద్ధమైంది. వివాహ క్రతువులో భాగంగా సోమవారం ఉషా పద్మిని ఛాయా దేవేరులతో శ్రీ వారి కల్యాణ మూర్తులను అనివెట్టి మండపంలో వేంచేసింపజేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో అర్చక బృందం వేదమంత్రోచ్ఛరణలు, మంగళధ్వనుల మధ్య సుగంధ ద్రవ్యాల మర్దన (కొట్నం దంపు) కార్యక్రమాన్ని నిర్వహించారు. దుంప పసుకుకొమ్ములు, జాజికాయ, జాపత్రి, వట్టివేళ్లు, పచ్చ కర్పూరం, కుంకుమపువ్వు తదితర సుగంధద్రవ్యాలను దంచుతూ... 'సువ్వి' అంటూ ఉత్సవ సంప్రదాయ కీర్తనలను శంకర శర్మ బృందం ఆలపించారు. స్వామివారి వార్షిక కల్యాణోత్సవం మంగళవారం రాత్రి 8.30 గంటల నుంచి జరగనుంది.

జాబ్‌మేళా పోస్టర్ విడుదల

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాబ్ మేళాపై రూపొందించిన పోస్టర్‌ను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ జాబ్ మేళాకి ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియెట్, డిగ్రీ, ఐటీఐ, బి ఫార్మసీ, చదువుకుని 18–30 ఏళ్ల మధ్య వయసు గల నిరుద్యోగ యువత అర్హులని తెలిపారు. ఈ నెల పదో తేదీన గురువారం ఉదయం 9 గంటల నుంచి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాతపట్నంలో జాబ్‌మేళా నిర్వహిస్తారని, 15 కంపెనీల ప్రతినిధులు హాజరవుతారని పేర్కొన్నారు.

వంటింటిలో మంట

- పెరిగిన గ్యాస్ ధర
- ఒక్కో సిలిండర్‌పై రూ. 50 పెంపు
- జిల్లాలో నెలకి రూ. 2కోట్ల మేర అదనపు భారం



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :

సామాన్యుడి వంటింటిలో ఎన్‌డీఏ ప్రభు త్వం మంట పెట్టింది. గత కొన్ని రోజులుగా వాణిజ్య సిలిండర్ ధరలను పెంచుతూ వస్తున్న ప్రభుత్వం తాజాగా గృహ వినియోగదారులకు వాత పెట్టింది. కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ ధరను రూ. 50 పెంచింది. ఇప్పటికే పెరుగుతున్న ధరలతో ఇబ్బందులు పడుతున్న సామాన్యులపై ఈ పెంపు మరింత భారం మోపుతుంది. పేద, మధ్య తరగతి కుటుంబాలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. వినియోగదారులపై నెలకి రూ. 2కోట్ల మేర అదనపు బాదుడు పడనుంది.

ఉక్కిరిబిక్కిరి

జిల్లాలో ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్న సామాన్యుడిపై మరో భారం మోపింది. కూరగాయల దగ్గరి నుంచి కిరాణా సరుకుల వరకు ధరలు పెరిగాయి. తాజాగా వంట గ్యాస్ ధర కూడా పెంచుతున్నట్టు ప్రకటించడంతో మూలిగే నక్కపై తాటి పండు పడినట్టైంది. సిలిండర్‌పై రూ. 50 పెంచుతున్నట్టు కేంద్రం ప్రకటించడంతో పేద, మధ్య తరగతి ప్రజలపై భారం పడనుంది. ఉజ్వల పథకం లబ్ధిదారులను సైతం ప్రభుత్వం వదల్లేదు. వారికి కూడా పెంపు వర్తిస్తుంది. ఇకపై ప్రతి 15రోజులకు లేదా ఒక నెలకు ధరలపై సమీక్షిస్తామని ప్రకటించడంతో ముందు మరింత పెరిగే అవకాశం కనబడుతోంది.

నెలకి రూ. 2కోట్లకు పైగా భారం

జిల్లాలో 37 గ్యాస్ ఏజెన్సీలు ఉన్నాయి. హెచ్‌పీసీఎల్ 17, బీఎహెచ్‌పీఎల్ 9, ఐఓసీఎల్ గ్యాస్ ఏజెన్సీలు 11ఉండగా, వాటి పరిధిలో 6లక్షల 92వేల 825గ్యాస్ కనెక్షన్‌లు ఉన్నాయి. ప్రతీ నెలా సరాసరి 4లక్షల సిలిండర్ల వినియోగం జరుగుతోంది. తాజాగా సిలిండర్‌పై రూ. 50 పెంచడంతో ఈ లెక్కన ప్రతి నెలా రూ. 2కోట్ల మేర వినియోగదారులపై అధనపు భారం పడనుంది. దేశంలో ప్రస్తుతం ఎక్కడా ఎన్నికలు జరగకపోవడం వల్లనేమో గానీ ఇన్నాళ్లు వాణిజ్య కనెక్షన్లను మాత్రమే పెంచుతూ వచ్చిన కేంద్రప్రభుత్వం తాజాగా సామాన్యుల వినియోగించే వంట గ్యాస్ ధరలను కూడా పెంచడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇది ఇక్కడితో ఆగేది లేదనే సంకేతాలు మరింత భయపెడుతున్నాయి.

మహిళలపై పెనుభారం



గ్యాస్ సిలిండర్‌పై రూ. 50 పెంపు మహిళలపై భారమే. ఇప్పటికే సంక్షేమ పథకాలు అమలు చేయకపోవడం వలన తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న ప్రజలపై మరో గుదిబండ పడింది.

– గురాన తిరుమల మానస, వల్లభరావుపేట గ్రామం

పేదలపై భారం



ప్రభుత్వం ఏడాదికి మూడు గ్యాస్ దిమ్మలు ఉచితంగా ఇస్తామని ప్రకటించింది. ఇప్పుడేమో గ్యాస్ బండపై రూ.50 పెంచారు. ఉచిత గ్యాస్ మొత్తాలను ఈ విధంలా లాగేస్తున్నారా..? గ్యాస్ బండ రేటు పెంచడం అమానుషం. పేదలపై భారం పడుతోంది. ప్రభుత్వం ఇది ఆలోచించి ధర తగ్గించాలి.


– చెట్ల హైమావతి, గృహిణి, పార్వతీశ్వరునిపేట, ఆమదాలవలస మున్సిపాలిటీ ఒకటో వార్డు

జీతాలిచ్చేసి.. తీసేయండి

- ఆదిత్యాలయంలో 49 మంది దినసరి వేతనదారులకు పెండింగ్ జీతాల చెల్లింపుపై ప్రత్యేక ఉత్తర్వులు జారీ
- 15 రోజుల్లోగా ఔట్‌సోర్సింగ్ అవసరాలపై నివేదిక కోసం త్రీమెన్ కమిటీ నియామకం



అరసవల్లి సూర్యదేవాలయం



అరసవల్లి:


ఏళ్ల తరబడి ఆదిత్యాలయంలో పనిచేసిన 49 మంది దినసరి వేతనదారులకు ఎట్టకేలకు పెండింగ్ జీతాల చెల్లింపునకు గ్రీన్‌సిగ్నల్ ఇస్తూ రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్ నుంచి సోమవారం మధ్యాహ్నం ఉత్తర్వులు వచ్చేశాయి. ఈ శుభవార్త వినగానే దినసరి వేతనదారులంతా ఎగిరి గంతేశారు. అయితే ఇంతలోనే ఆ ఉత్తర్వుల్లో అసలైన మెలిక అర్థమై నీరసించిపోయారు. 'గత 14 నెలలుగా ఉన్న పెండింగ్ జీతాలన్నీ వారికి చెల్లించేసి వెంటనే వారందరినీ ఆలయ విధుల నుంచి తొలిగించండి' అని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పెండింగ్ జీతాలు రూ.70 లక్షలు

అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారి ఆలయంలో గత కొన్నేళ్లుగా మొత్తం 49 మంది దినసరి వేతనదారులు విధులు నిర్వర్తిస్తున్నారు. వీరికి గత ఏడాది ఫిబ్రవరి నుంచి నేటి వరకు జీతాలు పెండింగ్‌లో ఉన్నాయి. అన్నదానం విభాగంలో 8 మంది, ప్రసాదాల తయారీ విభాగంలో ఏడుగురు, భజంత్రీ సిబ్బంది ఆరుగురు, పరిచారిక సిబ్బంది ఇద్దరు, అలాగే మిగిలిన పరిపాలన, టిక్కెట్లు విక్రయ కౌంటర్లు, కంప్యూటర్ విభాగ సిబ్బంది, స్వీపర్లు, పారిశుద్ధ్య సిబ్బంది 26 మంది కలిపి మొత్తంగా 49 మందికి నెలకు సుమారుగా రూ.5,50,500 వరకు జీతాలు కింద చెల్లించాల్సి ఉంది. ఈ ప్రకారం 14 నెలలకు గాను సుమారుగా రూ.70 లక్షల వరకు పెండింగ్ కింద జీతాలను ఆలయం నుంచే వారికి చెల్లించాల్సి ఉంటుంది.

ఆలయంలో రెగ్యులర్ ఉద్యోగుల సంఖ్య తక్కువగా ఉండడంతో ఇక్కడ ఇంతవరకు భక్తుల సౌకర్యార్థం 49 మంది దినసరి వేతనదారులే విధులను నిర్వర్తించేవారు. అయితే తాజాగా రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్ జారీ చేసిన ఉత్తర్వుల ప్రాప్తికి వీరికి పెండింగ్ జీతాలిచ్చేసి వెంటనే తొలిగించాల్సి ఉంది. అనంతరం ఆల య అవసరాలకు వాస్తవంగా ఎంత మంది సిబ్బంది అవసరమన్న అంశంపై ప్రత్యేక నివేదిక కోరుతూ త్రిమెన్ కమిటీని కూడా కమిషనర్ నియమించారు. ఈమేరకు దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ (విశాఖపట్నం), జిల్లా దేవదాయ శాఖాధికారి (శ్రీకాకుళం)తో పాటు అరసవల్లి ఆలయ ఈఓ (డిప్యూటీ కమిషనర్)లతో కూడిన కమిటి రానున్న 15 రోజుల్లోగా ఆదిత్యాలయానికి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఎంతమంది కావాలన్న నివేదికను సమర్పించాల్సి ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీంతో ఇక మీదట ఆలయంలో స్కిల్డ్, అన్‌స్కిల్డ్ నైపుణ్యతతో కూడిన సిబ్బంది మాత్రమే విధుల్లో ఉండనున్నారని స్పష్టమౌతోంది. ఎన్నో ఏళ్లుగా స్వామి ఆలయాన్ని నమ్ముకుని పనిచేసుకుంటున్న తమకు ఉద్యోగ అవకాశాలు ఇవ్వకూడదని చెప్పడంపై దినసరి వేతనదారుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది.

జీతాలిమ్మని ఆదేశాలు వచ్చాయి



ఆలయంలో దినసరి వేతనదారులుగా పనిచేస్తున్న 49 మందికి పెండింగ్ జీతాలిమ్మని, అలాగే వారిని వెంటనే తొలగించాలని కూడా ఆదేశాలు వచ్చాయి. అలాగే ఔట్‌సోర్సింగ్ నియామక అవసరాల కోసం త్రీమెన్ కమిటీ నివేదిక ఇవ్వాలని కమిషనర్ ఆదేశించారు.

– వై.భద్రాజీ, ఆలయ ఈఓ

అర్ధరాత్రి వచ్చి పొమ్మంటే ఎలా..?



టెక్కలి తహసీల్దార్ కార్యాలయంలో ఇన్‌చార్జి తహసీల్దార్‌తో మాట్లాడుతున్న అంబేద్కర్ జంక్షన్–చెట్లతాండ్ర రోడ్డు బాధితులు

టెక్కలి: రోడ్డు విస్తరణ పేరుతో అర్ధరాత్రి వచ్చి తెల్లవారింటికి ఇళ్లు ఖాళీ చేయాలని చెబితే ఎక్కడికి పోతాం అంటూ.. అంబేద్కర్ జంక్షన్ సమీపంలో నివాసం ఉంటున్న వారంతా సోమవారం రాత్రి తహసీల్దార్ కార్యాలయంలో అధికారులను నిలదీశారు. అంబేద్కర్ జంక్షన్ నుంచి చెట్లతాండ్ర మార్గంలో రోడ్డు విస్తరణకు చర్యలు చేపట్టిన క్రమంలో ఇటీవల మంత్రి అచ్చెన్నాయుడు శంకుస్థాపన పనులు చేపట్టారు. అయితే సోమవారం రాత్రి పంచాయతీ అధికారులు ఆ ప్రాంతానికి వెళ్లి ఉదయాన్నే ఇళ్లు ఖాళీ చేయాలని ఆదేశాలు జారీ చేయడంతో, అక్కడ నివసిస్తున్న వారంతా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని ఇన్‌చార్జి తహసీల్దార్ రవికుమార్ వద్ద సమస్యలు ఏకరువు పెట్టారు. అయితే ముందుగా దుకాణాలు తొలగిస్తామని, ఆ తర్వాత ఇళ్లు ఖాళీ చేయిస్తామని ఆయన సర్దిచెప్పారు.

ఇల్లు కోల్పోయిన వారందరికీ ఇల్లు ఇస్తామని మంత్రి చెప్పారని ఇప్పుడు ఉన్నఫలంగా ఇల్లు ఖాళీ చెయ్యమంటే, పిల్లలతో ఎక్కడకు వెళ్లాలని వారంతా నిలదీశారు. గతంలో ఇంటి స్థలం మంజూరు కాకపోయిన వారందరికీ ఇంటి స్థలాలు ఇస్తామని తహసీల్దార్ చెప్పడంతో అంతా వెనుదిరిగారు. ముందుగా ఇంటి స్థలాలు ఇచ్చిన తర్వాత విస్తరణ పనులు చేయాలి తప్ప ఇలా అర్ధరాత్రిళ్లు వచ్చి తెల్లవారింటికి ఇళ్లు ఖాళీ చేయాలని అధికారులు చెప్పడం సమంజసం కాదంటూ బాధితులు మండిపడ్డారు.



గాయపడిన విద్యార్థులు

స్కూల్ ఆటో బోల్తా

- ఏడుగురు విద్యార్థులకు గాయాలు

ఇచ్ఛాపురం టౌన్: పట్టణంలోని పురుషోత్తపురం నుంచి ఓ ప్రైవేటు పాఠశాలకు విద్యార్థులను తీసుకెళ్తున్న ఆటో సోమవారం బోల్తా పడింది. దీంతో ఏడుగురు గాయపడ్డారు. 12 మంది విద్యార్థులతో వెళ్తున్న ఆటో ముత్యాలమ్మపేట సమీపంలో ముందుగా వెళ్తున్న లారీని ఓవర్ టేక్ చేయబోయి అదుపు తప్పి బోల్తా పడింది. స్థాని కులు స్పందించి విద్యార్థులకు సపర్యలు చేశారు. విషయం తెలుసుకున్న సీఐ ఎం.చిన్నమనాయుడు, పట్టణ ఎస్ఐ ముకుందరావు సంఘటన స్థలానికి చేరుకుని గాయపడిన వారిని స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చేర్చారు. ప్రమాదానికి కారణమైన ఆటోడ్రైవర్ ఢిల్లేశ్వరరావుపై కేసు నమోదు చేశారు.



ఆటో డ్రైవర్‌తో మాట్లాడుతున్న ఎస్ఐ ముకుందరావు







బండి.. ఇలా వద్దండీ

ఇచ్ఛాపురంలో జరిగిన ఆటో ప్రమాదంతో అందరి దృష్టి జిల్లాకేంద్రంపై పడింది. అధిక సంఖ్యలో ప్రైవేటు స్కూళ్లు ఉండడంతో ప్రతి నిత్యం ఇలా పిల్లలకు ఆటోల్లో పరిమితికి మించి ఎక్కించి ప్రమాదాలను ఆహ్వానిస్తున్నారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

క్లుప్తంగా

ప్రశ్నపత్రాలను స్కూల్ పాయింట్ వద్దకే చేర్చాలి

శ్రీకాకుళం న్యూకాలనీ: సెల్ఫ్ అసెస్మెంట్ పరీక్షల ప్రశ్నాపత్రాలను స్కూల్ పాయింట్ వద్దకే చేర్చాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్వీ రమణమూర్తి, జి.రమణ ప్రభుత్వానికి సోమవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయులు ఉదయానికే పాఠశాలకు చేరుకొని, ఆ తర్వాత పరీక్ష ప్రశ్నాపత్రాలు తీసుకోవడానికి వెళ్లేటప్పుడు అనేక సమయాల్లో ప్రమాదాలకు గురైన సందర్భాలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చిత్తూరు జిల్లాలో ఒక ఉపాధ్యాయుడు ప్రశ్నాపత్రాలకు వెళ్లి పాఠశాలకు వస్తుండగా యాక్సిడెంట్ జరిగి మృత్యువాతపడిన విషయాన్ని గుర్తు చేశారు. ఇటువంటి ప్రమాదాలు జరిగిన తర్వాత కూడా అటు ప్రభుత్వం, ఇటు అధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టకపోవడం ఎంతమాత్రం సరికాదన్నారు. స్కూల్ పాయింట్ వద్దకే ప్రశ్నాపత్రాలు చేరవేసేందుకు పకడ్బందీగా చర్యలు చేపట్టాలని విన్నవించారు.

ఎస్పీ స్పందనకు 81 వినతులు



ఫిర్యాదుదారునితో మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ఎస్పీ స్పందనకు 81 వినతులు వచ్చాయి. ఈ సందర్భంగా అధికారులతో ఎస్పీ జూమ్ కాల్‌లో మాట్లాడారు. బాధితుల ఫిర్యాదులకు పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

నాటుసారా స్థావరాలపై దాడులు



స్వాధీనం చేసుకున్న నాటుసారా సామగ్రి

మెళియాపుట్టి: మండలంలోని హడ్డివాడ గ్రామంలో టెక్కలి ఎక్సైజ్ సీఐ షేక్ మీరా సాహెబ్ అధ్వర్యంలో పాతపట్నం ఎక్సైజ్ సిబ్బంది సమన్వయంతో నాటుసారా తయారీ స్థావరాలపై సోమవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 450 లీటర్ల పులిసిన బెల్లం ఊటలను ధ్వంసం చేశారు. అలాగే 80 లీటర్ల సారాతో కొసింటి నరసింహ అనే వ్యక్తిని అరెస్ట్ చేశారు. సారా తయారీకి వినియోగించిన సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు. సారా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మట్టి ట్రాక్టర్లు పట్టివేత



పట్టుబడిన మట్టి ట్రాక్టర్లు

రణస్థలం: మండల పరిధిలోని రామతీర్థాలు రహదారిలో ఆదివారం రాత్రి నాలుగు మట్టి ట్రాక్టర్లను జే.ఆర్.పురం పోలీసులు పట్టుకున్నారు. అయితే జే.ఆర్.పురం సర్కిల్ పోలీస్‌స్టేషన్ వద్ద ట్రాక్టర్లను ఉంచి తదుపరి కేసు నమోదు చేయకుండా విడిచిపెట్టారని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. అలాగే మండల తహసీల్దార్ ఎన్.ప్రసాద్ అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న ఒక ట్రాక్టర్‌ను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. దీనిపై భూగర్భ గనులశాఖ అధికారులు రూ.3,500 అపరాధ రుసుము విధించారు. వీటిపై జే.ఆర్.పురం ఎస్ఐ ఎస్.చిరంజీవికి వివరణ కోరగా మట్టి ట్రాక్టర్లను ఆదివారం రాత్రి పట్టుకున్నామని, అయితే ఒక నిర్మాణ దశలో ఉన్న ఇంటికి తీసుకెళ్తున్నట్లు తెలిసి విడిచిపెట్టామన్నారు. మరో గ్రావెల్ ట్రాక్టర్‌కు మైన్స్ అధికారులు ఫైన్ వేసి విడిచిపెట్టమని ఆర్డర్ రావడంతో వదిలేశామని తెలియజేశారు.

సేవా దృక్పథం అలవర్చుకోవాలి

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులు సేవా దృక్పథం అలవర్చుకోవాలని శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ) డైరెక్టర్ కొక్కిరాల వెంకట గోపాల ధనబాలాజీ అన్నారు. జాతీయ సేవా పథకం విద్యార్థులకు సోమవారం వాలంటీర్ సర్వీస్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ సేవా పథకంలో ప్రతీ విద్యార్థి చేరాలన్నారు. కార్యక్రమంలో ఏవో మునిరామకృష్ణ, డీన్ శివరామకృష్ణ పాల్గొన్నారు.





వైభవం.. శ్రీరామ పట్టాభిషేకం నరసన్నపేట: స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలోని గాంధీ కళామండపంపై సోమవారం శ్రీరామ పట్టాభిషేకం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా కోలాటం, నృత్య ప్రదర్శనలు చేపట్టారు.

అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
- మీకోసంకు 190 ఫిర్యాదులు

శ్రీకాకుళం పాతబస్టాండ్:

ప్రజా సమస్యలపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మీకోసం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. దీనిలో భాగంగా 190 ఫిర్యాదులను అధికారులు స్వీకరించారు. పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుల విషయంలో సంబంధిత శాఖల అధికారులు బాధ్యతగా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్ ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఫిర్యాదుల్లో రెవెన్యూ శాఖకు సంబంధించి 79 ఫిర్యాదులు రాగా, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థకు సంబంధించి 40 ఫిర్యాదులు, పంచాయతీ రాజ్ శాఖకు సంబంధించి 19 ఫిర్యాదులు వచ్చాయి. ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ లిమిటెడ్‌కు సంబంధించి 10 ఫిర్యాదులు, పురపాలక పరిపాలన, సర్వే సెటిల్‌మెంట్స్, భూ రికార్డులు, గ్రామీణాభివృద్ధి శాఖల నుంచి చెరో 5 ఫిర్యాదులు నమోదయ్యాయి. అలాగే ఇతర శాఖల నుంచి మరి కొన్ని ఫిర్యాదులు అందాయి.

టీడీపీ నేతలపై చర్యలు తీసుకోండి



కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రవికుమార్

శ్రీకాకుళం పాతబస్టాండ్: అధికార బలంతో గ్రామాల్లో టీడీపీ నేతలు అడ్డగోలుగా చేపడుతున్న పనులపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ కోరారు. ఈ మేరకు పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. పొందూరు మండలంలోని తానేం గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో ప్రైవేటు లే అవుట్‌కి రోడ్డు వేశారని తెలిపారు. నిజానికి ఆ రోడ్డుకి ఆనుకొని ఎటువంటి నివాసాలు లేవని పేర్కొన్నారు. దీనికోసం సుమారుగా రూ.28 లక్షల నిధులు దుర్వినియోగం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ఆమదాలవలసలో రెచ్చిపోతున్న ఇసుక మాఫియాపై చర్యలు తీసుకోవాలని విన్నవించారు. నకిలీ బిల్లులతో శ్రీకాకుళం నుంచి విశాఖపట్నంకు విచ్చలవిడిగా ఇసుక రవాణా చేస్తున్నారన్నారు. అదేవిధంగా సరుబుజ్జిలి మండలంలోని గోనెపాడు పంచాయతీలో రైతుల రెవెన్యూ రికార్డులు సరిచేయాలని కోరారు. చిగురువలస పంచాయతీ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో కోర్టులో పెండింగ్ ఉన్న స్థలంలో అక్రమంగా రాత్రికి రాత్రి సీసీ రోడ్డు నిర్మాణం చేశారని, దీనిపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. బూర్జ మండలం నీలాదేవిపురంలో ఉపాధి పనుల మేట్ల నియామకాల్లో మండల అధికారులు అత్యుత్సాహం చూపుతున్నారని వివరించారు. పొందూరు మండలంలోని గోకర్ణపల్లి గ్రామంలో అక్రమంగా తొలగించిన వీవోఏని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు.

ప్రజలకు రక్షణ కల్పించండి



కలెక్టర్‌కు సమస్యలు వివరిస్తున్న పేరాడ తిలక్

టెక్కలి: టెక్కలి నియోజకవర్గంలో మంత్రి అచ్చెన్నాయుడి అండతో టీడీపీ కార్యకర్తలు చేస్తున్న దౌర్జన్యాల నుంచి సామాన్య ప్రజలు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో పాటు అధికారులకు రక్షణ కల్పించాలని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ కోరారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో పాటు ఎస్పీ కె.వి.మహేశ్వర్‌రెడ్డిని సోమవారం కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఇటీవల సంతబొమ్మాళి మండల టీడీపీ అధ్యక్షుడు జీరు భీమారావు కలెక్టర్, ఆర్డీవోపై చేసిన దూషణతో పాటు మూలపేట సర్పంచ్ జీరు బాబురావును చంపేస్తానంటూ బెదిరించిన ఘటనలపై చర్యలు తీసుకోవాలని విన్నవించారు. కోటబొమ్మాళి మండలం సింహాద్రిపురం గ్రామంలో సామాన్య రైతులకు చెందిన భూముల్లో దౌర్జన్యంగా రోడ్లు వేయడమే కాకుండా, అడ్డువచ్చిన వారిపై దాడులు చేసిన ఘటనలను వివరించారు. అలాగే సంతబొమ్మాళి మండలం జగన్నాథపురం సర్పంచ్ రాములమ్మకు చెందిన స్థలంలోని కొబ్బరి చెట్లను రాజకీయ కక్షతో అన్యాయంగా తొలగించడమే కాకుండా, ఆమెపై కేసులు నమోదు చేశారని తెలిపారు. కమలనాభపురం గ్రామంలో అన్యాయంగా వృద్ధాప్య పింఛన్ల నిలిపివేతపై ఆవేదన వ్యక్తం చేశారు. వీటితో పాటు మరికొన్ని దౌర్జన్యాలు, కక్ష సాధింపు చర్యలపై జిల్లా అధికారులకు విన్నవించారు. ఆయనతో పాటు కోటబొమ్మాళి జెడ్పీటీసీ దుబ్బ వెంకట్రావు, నాయకులు ఎస్.హేమసుందర్‌రాజు, బి.మోహన్‌రెడ్డి, పి.వెంకట్రావు, రాములమ్మ, బాబురావు, శివారెడ్డి తదితరులు ఉన్నారు.

రేషనలైజేషన్ తీరు సరికాదు



వినతిపత్రాలను చూపిస్తున్న పీడీ, పీఈటీ సంఘ జిల్లా నాయకులు

- పీడీ పోస్టులను కన్వర్షన్ చేయవద్దు
- జిల్లా పీఈటీ సంఘ నాయకులు

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రంలో స్పోర్ట్స్ కోటాను పక్కాగా అమలు చేస్తామని ప్రకటించిన కూటమి ప్రభుత్వం, ఆచరణలో మాత్రం ఆ దిశగా తీసుకుంటున్న చర్యలు శూన్యంగానే ఉన్నాయని జిల్లా పీడీ, పీఈటీ సంఘ అధ్యక్షుడు మొజ్జాడ వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి మెంటాడ సాంబమూర్తి, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బీవీ రమణలు అన్నారు. ఇంటర్మీడియట్ విద్యను అందిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో తాజాగా రేషనలైజేషన్ పేరిట 199 జేఎల్ ఫిజికల్ ఎడ్యుకేషన్ పోస్టులను, ఇతర సబ్జెక్టులకు మార్పు చేయడాన్ని వారు తీవ్రంగా తప్పుబట్టారు. ఈ మేరకు జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం అందుబాటులో ఉన్న పీడీ, పీఈటీలతో అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. ఇంటర్ విద్య అధికారులు తీసుకుంటున్న చర్యలను ఖండిస్తూ ప్రజాప్రతినిధులకు లేఖలు రాశారు. త్వరలో సీఎం చంద్రబాబును, విద్యాశాఖమంత్రి లోకేష్‌ను కలిసి ఇంటర్ విద్యలో ఫిజికల్ ఎడ్యుకేషన్ లెక్చరర్ల అవసరాన్ని వివరిస్తామన్నారు.

పదోన్నతుల ద్వారా జరగాల్సిందే

ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్ హైస్కూల్స్‌లో పనిచేస్తున్న ఫిజికల్ ఎడ్యుకేషన్ స్కూల్ అసిస్టెంట్లను పదోన్నతల ద్వారా జేఎల్‌లుగా ఉన్నతీకరణ చేసే ప్రక్రియ జరుగుతున్న సమయంలో ఇంటర్ విద్య డైరెక్టర్ తీసుకున్న నిర్ణయాన్ని ఎండగట్టారు. ఏకపక్ష విధానంతో ఫిజికల్ ఎడ్యుకేషన్ పోస్టులను ఇతర సబ్జెక్టులకు ఎలా కన్వర్షన్ చేస్తారని ప్రశ్నించారు. కనీసం సంబంధిత అధికారులు, ప్రిన్సిపాల్స్, లెక్చరర్లు, వివిధ వర్గాల ప్రతినిధుల అభిప్రాయాలు తీసుకోకుండా వ్యవస్థను నిర్వీర్యం చేసే చర్యలు ఏవిధంగా తీసుకుంటారన్నారు. ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకొచ్చే విధంగా ఇంటర్‌విద్య అధికారుల రేషనలైజేషన్ మార్గదర్శకాలు ఉన్నాయన్నారు. ప్రభుత్వ పెద్దలకు తెలిసి ఈ చర్యలు ఉంటాయని తాము భావించడంలేదని, కాలేజీల్లో నాలుగు గోడల మధ్యన క్లాసుల ఒత్తిడిలో నిలిగిపోతూ మానసికంగా ఇబ్బంది పడుతున్న విద్యార్థులకు ఫిజికల్ ఎడ్యుకేషన్ ఎంతో అవసరమని గుర్తుచేశారు. ఇంటర్‌లో ఫిజికల్ ఎడ్యుకేషన్ పోస్టులు లేకుంటే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో స్కూల్‌గేమ్స్ అండర్–19 పాల్గొనే బాలబాలికల క్రీడా భవిష్యత్తు సైతం అంధకారం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యాయామ విద్యను బతికించాలని ప్రభుత్వానికి విన్నవించారు. సమావేశంలో పీడీలు చల్లా జగదీష్, లక్ష్మీనారాయణ, గురుగుబెల్లి రాజశేఖర్, ఎస్వీ రమణ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీపేట కోర్టు న్యాయమూర్తిగా తిరుమలరావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని లక్ష్మీపేట 5వ జిల్లా కోర్టు న్యాయమూర్తిగా డి.తిరుమలరావుని నియమించారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు ఈ పోస్టు ఖాళీగా ఉంది. తిరుమలరావు ఇప్పటివరకు గుంటూరు ఇండస్ట్రియల్ ట్రిబ్యునల్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఈయనను లక్ష్మీపేట కోర్టుకి బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

విపత్తులను ఎదుర్కొనేందుకు మాక్ డ్రిల్స్

- ఈ నెల 11న శ్రీకాకుళం, 12న కోనసీమలో

సాక్షి, అమరావతి : నైరుతి రుతుపవనాల సీజన్‌లో తుఫాను, వరదలు, భారీవర్షాలు వంటి విపత్తులు సంభవిస్తే ఎదుర్కోడానికి విపత్తుల నిర్వహణ సంస్థ సన్నద్ధమవుతుందని ఆ సంస్థ ఎండీ రోణంకి కూర్మనాథ్ తెలిపారు. తుపాను, వరదల సమయంలో ఎలాంటి ప్రమాదం ఎదురవుతుంది, ఆ సమయంలో దాని నుంచి తప్పించుకోవడానికి ప్రజలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, రక్షక దళాలకు ఎలా సహకరించాలి, అధికారులు తక్షణం ఎలాంటి చర్యలు తీసుకోవాలి అనే దానిపై మాక్ డ్రిల్స్ నిర్వహిస్తున్నామని ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో తుఫాను, వరదలకు ప్రభావితమయ్యే 17 జిల్లాల్లోని నదీ, తీరప్రాంతాల్లో మాక్ డ్రిల్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే కృష్ణా, పశ్చిమగోదావరి, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, విశాఖ, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాల్లో మాక్ డ్రిల్స్ నిర్వహించామని తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలో ఈ నెల 11న, కోనసీమ 12న, విజయనగరం 16న, తూర్పుగోదావరి 22న, నెల్లూరు 24న, అనకాపల్లి 26న, పల్నాడు 29న, పార్వతీపురం మన్యం మే 2న, తిరుపతి మే 6న, బాపట్ల జిల్లాలో మే 9న మాక్ డ్రిల్స్ నిర్వహిస్తామన్నారు. ప్రకృతి విపత్తుల పట్ల అవగాహన కలిగి ఉండటం వలన ఆస్తి, ప్రాణాలను కాపాడుకోవచ్చని పేర్కొన్నారు.

మాక్ డ్రిల్స్‌లో విపత్తుకి ముందు, విపత్తు సమయంలో, ఆ తర్వాత ఎలా వ్యవహరించాలనే అంశాలపై ప్రజలకు ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్, ఫైర్, పోలీసు సిబ్బంది వివిధ రెస్క్యూ పరికరాలతో అవగాహన కల్పిస్తున్నారని అన్నారు. శిథిలావస్థ భవనాల్లోని ప్రజలను రక్షించడం, కొమ్మలు తొలగించి రోడ్డుకు సౌకర్యం కలిగించడం, వరద ప్రవాహం ఉన్నప్పుడు అందుబాటులో ఉన్న వస్తువులు/తాడు సహాయంతో సురక్షిత ప్రాంతానికి వెళ్ళడం, భయాందోళనలకు గురికాకుండా ప్రథమ చికిత్స చేయడం, మెరుగైన వైద్యం కోసం అంబులెన్స్ లో తరలించడం వంటి ఉపాయాలను(టెక్నిక్స్) ప్రజలకు తెలుపుతామన్నారు.

వంశధారలో పడి జాలరి మృతి



మృతుడు అప్పన్న (ఫైల్)

నరసన్నపేట: మండలంలోని మడపాం వద్ద చేపలవేటకు వెళ్లిన జాలరి వాడ అంజలి అప్పన్న(40) ప్రమాదవశాత్తు నదిలో మునిగి మృతి చెందాడు. సోమవారం ఉదయం మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని ఉప్పరిపేటకు చెందిన అప్పన్న నదిలో చేపలవేట చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. ఈ మేరకు ఆదివారం మధ్యాహ్నం చేపలవేటకు వెళ్లాడు. అయితే అప్పన్న రాత్రి 9 గంటల వరకు ఇంటికి రాకపోవడంతో, స్థానికుల సాయంతో కుటుంబ సభ్యులు గాలించారు. కానీ ఆచూకీ లభించకపోవడంతో ఉదయం మళ్లీ గాలించగా, కరజాడ వైపు వంతెన నాల్గో ఫిల్లర్ వద్ద అతడి ద్విచక్ర వాహనం గుర్తించారు. అక్కడికి కొంత దూరంలో నీరు ఉన్న ప్రదేశంలో చూడగా అప్పన్న మునిగి ఉన్నట్లు గమనించి లోపలికి దిగగా మృతదేహం కనిపించింది. దీంతో కుటుంబ సభ్యులు ఒక్కసారిగా కన్నీటి పర్యంతమయ్యారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టంకు పంపించారు. అప్పన్న భార్య మాధురి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మృత్యువుదే విజయం



ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలోని కేశవరావుపేట పంచాయతీ కింతలిమిల్లు సమీపంలో జాతీయ రహదారి మీద ఇద్దరు స్నేహితులు బైక్‌పై వెళ్తూ ఆదివారం రోడ్డు ప్రమాదానికి గురైన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో ఘటన స్థలంలోనే జరజాం గ్రామానికి చెందిన హరిప్రసాద్ (23) మృతి చెందగా, ఎచ్చెర్ల గ్రామానికి చెందిన జలుమూరు వేణు (22) తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఈ యువకుడిని, కుటుంబ సభ్యులు ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అయితే ప్రైవేట్ ఆస్పత్రి వైద్యులు పరీక్షలు నిర్వహించి, విశాఖపట్నం కేజీహెచ్‌కు తీసుకెళ్లాలని సూచించారు. దీంతో కేజీహెచ్‌కు ప్రత్యేక అంబులెన్స్‌లో తీసుకెళ్లారు. అయితే కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి ఒంటి గంట తర్వాత వేణు తుదిశ్వాస విడిచాడు. కాగా ఈ విషాద సమయంలోనే నేత్రదానానికి కుటుంబ సభ్యులు ముందుకొచ్చారు. దీంతో ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి సిబ్బంది నేత్రాలను సేకరించారు. మృతుడి తండ్రి గోపీ సైతం ఆర్టీసీ సంస్థలో పని చేస్తూ నాలుగేళ్ల క్రితం మృతి చెందాడు. నాలుగేళ్ల వ్యవధిలో ఈ కుటుంబానికి విధి ఇద్దరిని దూరం చేసింది. మృతుడి అన్నయ్య దిలీప్, తల్లి హేమలత కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఎచ్చెర్ల పోలీసుల సమక్షంలో పోస్టుమార్టం పూర్తిచేసి, మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఎచ్చెర్లలో సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు. ఇద్దరి స్నేహితుల మృతిని తోటి యువకులు జీర్ణించుకోలేకపోతున్నారు.

రైలు ఢీకొని యువకుడి మృతి

పొందూరు: పొందూరు–జి.సిగడాం రైల్వేస్టేషన్ల మధ్యలో వాండ్రంగి రైల్వేగేటు సమీపంలో ఆదివారం రాత్రి రైలు ఢీకొనడంతో రెడ్డి వెంకటరమణ(20) అనే యువకుడు మృతి చెందినట్లు జీఆర్పీ ఇన్‌చార్జి ఎస్ఐ షరీఫ్ తెలిపారు. మృతుడిది విజయనగరం జిల్లా రాజాం మండలంలోని సీఎస్ఆర్ పురం గ్రామంగా గుర్తించామని పేర్కొన్నారు. ప్రమాదవశాత్తు మృతి చెందాడా, ఆత్మహత్య చేసుకున్నాడా అనేది విచారిస్తున్నామని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వెల్లడించారు.

ఆర్టీసీలో హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం



డ్రైవింగ్ శిక్షణపై అవగాహన కల్పిస్తున్న డీఎం కేఆర్ఎస్ శర్మ

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ శ్రీకాకుళంలో హెవీ వెహికల్ డ్రైవింగ్‌లో ఇస్తున్న శిక్షణను అర్హులైన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటి, రెండు డిపోల డీఎంలు హనుమంతు అమరసింహుడు, కేఆర్ఎస్ శర్మ కోరారు. శ్రీకాకుళం ఆర్టీసీ ఆధ్వర్యంలో నడుస్తున్న హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణకు సంబంధించిన 20వ బ్యాచ్‌ను కాంప్లెక్స్ కార్యాలయ ఆవరణలో శ్రీకాకుళం ఒకటి, రెండు డిపోల డీఎంలు హనుమంతు అమరసింహుడు, కేఆర్ఎస్ శర్మలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రమశిక్షణ, అంకిత భావంతో అభ్యర్థులు శిక్షణను నేర్చుకోవాలన్నారు. 21వ బ్యాచ్‌లో చేరుటకు ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుచున్నామని తెలిపారు. లైట్ వెహికల్ లైసెన్స్, ఒక సంవత్సరం అనుభవం కలిగి ఉండాలని, 21 ఏళ్లు నిండిన వారు ఈ హెవీ వెహికల్ డ్రైవింగ్ ట్రైనింగ్‌కు అర్హులని పేర్కొన్నారు. మొత్తము శిక్షణ 40 రోజులు ఉంటుందని తెలిపారు. ఫీజు, ఇతర వివరాల కోసం 7382923293, 7095040608 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్టీసీ పర్సనల్ ఆఫీసర్ కృష్ణవేణి, శ్రీకాకుళం 1, 2 డిపోల అసిస్టెంట్ మేనేజర్‌లు వి.రమేష్, ఎ.గంగరాజు, శిక్షకుడు జీఎస్ రావు, సుమన్ పాల్గొన్నారు.

వంశధారను ఆధునీకరిస్తాం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు తదితరులు

నరసన్నపేట: జిల్లాలోని రైతులకు రెండు పంటలకు సాగునీరు అందేలా వంశధారను ఆధునీకరిస్తామని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. మండలంలోని ఉర్లాం పంచాయతీ బడ్డవానిపేట వద్ద నూకాలమ్మ కాలవ్‌పై ప్రధానమంత్రి సడక్ యోజన నిధులు రూ.2.60 కోట్లతో నిర్మించనున్న వంతెన పనులను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంశధార ఆధునీకరణకు రూ.1,000 కోట్లు అవసరమని భావిస్తున్నామన్నారు. ఈ నిధులు ఎలాగైనా సమీకరించి పనులు చేయిస్తామన్నారు. అలాగే షట్టర్ల విషయంపై కూడా చర్చించి తగు చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. అదేవిధంగా ఉర్లాం రైల్వేస్టేషన్‌ను అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. విశాఖ–భువనేశ్వర్ ఎక్స్‌ప్రెస్ హాల్ట్‌కు అనుమతి తీసుకు వస్తామన్నారు. అంతకు ముందు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ స్థానిక సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. షట్టర్లు బాగు చేయాల్సిన అవసరాన్ని వివరించారు. కార్యక్రమంలో ఉర్లాం సర్పంచ్ పోలాకి నర్సింహమూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకుడు నడిమింటి శాంతారావు తదితరులు పాల్గొన్నారు.

పెద్ద మనసు

శ్రీకాకుళం నగరంలో ఎండ తీవ్రత రోజురోజుకి పెరిగిపోతోంది. దీంతో డే నైట్ జంక్షన్ వద్ద ట్రాఫిక్ పోలీసుగా విధులు నిర్వహిస్తున్న చంద్రశేఖరరావు మంచి మనసు చాటుకున్నారు. బ్యాంకర్స్ కాలనీలోని సత్యసాయి సేవా సమితి సౌజన్యంతో కలిసి వాహనదారులు, ప్రజలకు మజ్జిగను సోమవారం పంపిణీ చేశారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం



